క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా


కట్టా ఏసుబాబు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కట్టా ఏసుబాబు చెప్పారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఏసుబాబును ఇటీవల చేపట్టిన నియామకాల్లో గ్రీవెన్స్ సెల్‌కు నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఆయన స్పందిస్తూ పార్టీలో కష్టపడిన వారిని గుర్తిస్తున్న అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తాజాగా తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గణపవరం ఏవోగా ప్రసాద్


ఏవో ప్రసాద్

గణపవరం: మండల వ్యవసాయ అధికారిగా ఆర్‌ఎస్ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తాడేపల్లిగూడెం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ గణపవరం ఏవోగా పని చేసిన యర్రంశెట్టి ప్రసాద్ భీమవరం మండల ఏవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించడమే లక్ష్యమన్నారు. సాగులో అనవసర ఖర్చులు తగ్గించుకునేలా రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

దేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధి


వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

గణపవరం: దేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వికసిత్ భారత్ సంకల్ప కన్వీనర్ గారపాటి తపన చౌదరి అన్నారు. గణపవరం మండల బీజేపీ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా కన్వీనర్ కాకర్ల వినాయక, శరణాల మాలతీరాణి, నగరపాటి సత్యనారాయణ, శోభారాణి, కూనిరెడ్డి సోమేశ్వరరావు, ఇందుకూరి అశోక చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం నిర్వహణ

ఉంగుటూరు: నియోజకవర్గంలో 'స్వర్ణాంధ్ర విజన్- 2047' కార్యాచరణకు సంబంధించిన వ్యూహాత్మక ప్రణాళికలు, శాఖల సమన్వయం తదితర అంశాలపై నియోజకవర్గ నోడల్ అధికారి, ఎంపీడీవో, తహసీల్దార్, సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్ది హుండీల ఆదాయం రూ.54.71 లక్షలు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో హుండీ ఆదాయన్ని గురువారం లెక్కించినట్టు మద్ది ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. 85 రోజులకు హుండీల ద్వారా రూ.49,67,182, చిల్ల రూపేణా రూ.4,22,927, అన్నదానం హుండీ ద్వారా రూ.81,370 మొత్తం ఆదాయం రూ.54,71,479 వచ్చినట్టు చెప్పారు. ఏలూరు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవీబీ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన

కొయ్యలగూడెం: అతిసారా వ్యాధిపై బయ్యన్నగూడెం దళితవాడలో గురువారం బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లల్లో అతిసార వ్యాధి వల్ల మరణాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈనెల 16 నుంచి జూలై 31 వరకు అతిసార వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బిడ్డకు రోజులో మూడు లేదా అంత కంటే ఎక్కువ సార్లు నీళ్లగా విరోచనాలయితే అది అతిసార వ్యాధి అని, అతిసారంలో శరీరంలో ఉండే ఖనిజ లవణాలు బయటకు పోయి డీ హైడ్రాషన్‌కు లోనైనపుడు వెంటనే ఓఆర్‌ఎస్ ద్రావణం తాగటం వల్ల మరణాలు సంభావించకుండా కాపాడుకోవచ్చని వివరించారు. చల్లార్చిన మంచి నీటినిగాని క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలని, తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు.

పేదల ఆరోగ్యానికి భరోసా ఏదీ?

- స్కానింగ్‌లు, రక్త పరీక్షలతో రోగుల జేబులు ఖాళీ
- నిలిచిన ఆరోగ్య ఆసరా
- వైద్య శిబిరాలు నిల్.. వ్యాధులు ఫుల్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో కానరాని సేవలు

దెందులూరు: పేదల ఆరోగ్యానికి భరోసా లేదని అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వెళుతుంటే పూర్తి స్థాయిలో వైద్యం అందని పరిస్థితులు దాపురించాయని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు. వైద్యం ఉచితంగా అరకొరగా అందుతున్నా మందు బిళ్లల కొరతతో పాటు వైద్య పరీక్షలకు వేలాది రూపాయలు కుమ్మరించాల్సి వస్తుందని రోగులు ఆరోపిస్తున్నారు. స్కానింగ్‌లు, రక్త పరీక్షల రూపంలో రోగుల జేబులు ఖాళీ అవుతున్నాయని వాపోతున్నారు. గతంలో ఎంతో ఉదారంగా అందే వైద్య సేవలు నేడు కుంటు పడే పరిస్థితికి చేరుకున్నాయని చెబుతున్నారు.

నిలిచిన ఆరోగ్య ఆసరా:
ఆరోగ్య ఆసరా కార్యక్రమం ద్వారా పలు విభాగాల్లో శస్త్ర చికిత్సలు చేయించుకుని డిశ్చార్జ్ అయ్యే సమయంలో ఆసరా ఎంతో అండగా ఉండేదని రోగులు చెబుతున్నారు. శస్త్ర చికిత్స అనంతరం రోగి పౌష్టికాహారం తీసుకునేందుకు విశ్రాంతి సమయంలో రోజుకు రూ.225 చొప్పున వైద్యులు నిర్ధేశించిన కాలానికి నగదు రోగి బ్యాంకు ఖాతాకు జమయ్యేదని, ఇలా రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు రోగికి డబ్బు అందే వెసులుబాటు గత ప్రభుత్వ హయాంలో ఉండేది. ఇందులో భాగంగా అత్యధికంగా న్యూరో కేసుల్లో వేలాది రూపాయలు రోగికి డబ్బు అందడంతో వారి మందులు, ఇతర ఖర్చులకు ఆ మొత్తాన్ని వినియోగించుకునేవారు. కానీ గతేడాది ఆగస్టు నుంచి ఆరోగ్య ఆసరా పథకాన్ని కూటమి ప్రభుత్వం నిలిపి వేసింది. ఆరోగ్య మిత్రలు రోగుల నుంచి ధృవ పత్రాలు తీసుకుంటున్నా కానీ సొమ్ము మాత్రం వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలకు ముందుగా చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్టులు అనగా స్కానింగ్ పరీక్షల తాలూకా మొత్తాన్ని కూడా చెల్లించే పరిస్థితి వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఉండగా నేడు ఆ సౌకర్యాన్ని కూడా తొలగించినట్లుగా రోగులు చెబుతున్నారు.


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఆరోగ్యం విషయంలో వివక్ష తగదు



పేద బడుగు బలహీన గిరిజన మైనారిటీ వర్గాల ప్రజల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం నూరు శాతం అంకితభావంతో సేవలందించాలి. పకడ్బందీగా వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి. పేదలకు వైద్య సేవల్లో లోపం తలెత్తితే వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటం తప్పక ఉంటుంది.

–నిట్టా లీల నవకాంతం, జెడ్పీటీసీ, దెందులూరు

వైద్య శిబిరాలు నిర్వహించాలి



ప్రతి గ్రామ శివారు అటవీ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి. మందుల కొరత లేకుండా చూడాలి. ఆ వైద్య శిబిరాల ద్వారా లక్షలాది మంది పేద ప్రజలకు వైద్యం అందుతుంది. 104, 108 సేవలను మరింత విస్తృతం చేయాలి. అదే విధంగా అన్ని ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి.

–కె.కృష్ణవేణి, వార్డు మెంబర్, దెందులూరు

సికిల్ సెల్ ఎనీమియా నివారణే లక్ష్యం

దెందులూరు: సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా గురువారం గోపన్నపాలెం పీహెచ్‌సీలో ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ దొండపాడు జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కో–ఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గోపన్నపాలెంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.రోజా లలిత, డాక్టర్ రాకేష్, ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, షూ, సాక్స్, బెల్ట్, బ్యాగు కిట్‌లో ఉన్నాయని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ, పాఠశాల హెచ్‌ఎం జి.శర్మ, ఎంపీడీఓ కె.శ్రీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

కుంగిన రహదారి.. తరచూ ప్రమాదాలు


సీతారామపురం–నిడమర్రు గ్రామాల మధ్య కుంగిన రహదారి

ఉంగుటూరు: చేబ్రోలు–ఉండి ఆర్‌అండ్‌బీ రహదారిలో సీతారాపురం–నిడమర్రు గ్రామాల మధ్య రహదారి కుంగిపోయింది. సుమారు 50 మీటర్లు ఒక చోట, 20 మీటర్లు ఒకచోట దిగబడింది. దీంతో వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు. ఈ పరిస్థితి మూడు నెలల నుంచి ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. దీంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఓ వైపు మురుగు కాలువ ఉండటంతో ఇలా దిగబడి పోతుందని రైతులు అంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నద్ధం

పెదవేగి : అంతర్జాతీయ యోగా దినోత్సవం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఈ మేరకు అన్ని శాఖల అధికారులు నెల రోజులుగా యోగాంధ్ర కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా పలు యోగా పోటీలు నిర్వహించారు. దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక యోగా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జూన్ 21న అంతర్జాతీయ యోగా వేడుకలను విశాఖపట్నంలో నిర్వహించాలని ఆ వేడుకలకు హాజరవుతానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారని అధికారులు తెలిపారు. ఇందుకు అనుగుణంగా విశాఖలో యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ అనే నినాదంతో యోగా దినోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.


పెదవేగి: యోగ సాధన చేయిస్తున్న గురువులు (ఇన్‌సెట్‌లో) ప్రాణాయామం చేస్తున్న ప్రిన్సిపాల్ స్లీవరాజు

నిడమర్రులో యోగా అవగాహన ర్యాలీ
నిడమర్రు: యోగాపై అవగాహన ర్యాలీని నిడమర్రులో గురువారం నిర్వహించారు. యోగా చేయండి–ఆరోగ్యంగా ఉండండి అనే నినాదాలు చేశారు. ప్రభుత్వ ఆయుర్వేదం ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ జియాబాయ్, ఎంపీడీవో విజయ కుమారి, యోగా మాస్టర్ ట్రైనర్ పీవీ పెద్దిరాజు, మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు.



నిడమర్రు: యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

రేపు యోగా నిర్వహణకు ఏర్పాట్లు
ఉంగుటూరు: రేపు యోగాంధ్ర కార్యక్రమం ఉంగుటూరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీవో రాజమనోజు తెలిపారు. ఎంపీడీవో ఆఫీసు ప్రాంగణం వద్ద, సచివాలయం వద్ద, హైస్కూలు వద్ద మూడు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు గురువారం ఈ విషయమై సమీక్షించారు. ఆయుష్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ ఆఫీసరు డాక్టర్ ప్రసాద్, సహాయకురాలు కృష్ణవేణి, యోగా మాస్టర్ ట్రైనర్లు పెద్దిరాజు, జయలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ రవికుమార్, ఏవో ఆంజనేయులు పాల్గొన్నారు.

యోగ సాధన ఎంతో అవసరం



యోగ సాధన మానవుని దైనందిన జీవితంలో ఎంతో అవసరం. నిత్యం యోగా చేయడంతో శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుంది. దీంతో ఆసుపత్రులకు వెళ్లవలసిన అవసరం తగ్గుతుంది.

–డాక్టర్ ఎ.కావ్య, ఇంటర్న్, దంత వైద్య కళాశాల

యోగా చాలా గొప్పది



యోగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనం. క్రమం తప్పకుండా ప్రతి వ్యక్తి తన దైనందిన జీవితంలో యోగాను పాటిస్తే అద్భుతాలు చూడొచ్చు. నిత్యం అనుభవజ్ఞులతో సాధన చేయడంతో ఏకాగ్రత, మనశ్శాంతి, ఆరోగ్యంగా ఉంటారు.

–డాక్టర్ బి.లోకేష్‌రెడ్డి, ఇంటర్న్, దంత వైద్య కళాశాల

యోగాతో ఆరోగ్యకరమైన జీవనం

గణపవరం: యోగాతోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవనంలో యోగాను అలవాటుగా చేసుకోవాలని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. గురువారం సాయంత్రం డిగ్రీ కాలేజీ ఆవరణలో గణపవరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో మాస్ యోగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యోగా వలన సంపూర్ణ శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఒత్తిడిని జయించే సామర్థ్యం పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గొర్రెల బాలయ్య, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కె.స్వరూపరాణి, ఐక్యు ఏసీ కో–ఆర్డినేటర్ సీహెచ్ చైతన్య, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1, 2 ఆఫీసర్లు జి.వెంకటరమణ, కేవీ గణేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


యోగా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈపూరి

అర్హులందరికీ 'తల్లికి వందనం' అందించాలి

కామవరపుకోట: అర్హులైన వారందరికీ తల్లికి వందనం అందించాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు తల్లికి వందనం పేరుతో ప్రభుత్వం అందిస్తున్న డబ్బులు వివిధ కారణాలు చూపించి అనేక మందికి ఎగ్గొట్టారన్నారు. స్థానిక కొత్తూరు యానాదులు కాలనీకి చెందిన చౌటూరి కోటమ్మ 300 పైబడి యూనిట్లు విద్యుత్ వాడిందని, తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం డబ్బులు ఆపేశారని తెలిపారు. చాలీచాలని ఆ ఇంటిలో రెండు బల్బులు వాడిన ఆ కుటుంబానికి 300 యూనిట్లు బిల్లు ఎలా వస్తుందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధితో అర్హులందరికీ తల్లికి వందనం డబ్బులు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనికెళ్ల రత్నకుమారి, తమ్మిశెట్టి గిరిజ, ఎంపీడీఓ కె.సరళ కుమారి, ఎంఈఓ డి.సుబ్బారావు వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమేష్

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

జంగారెడ్డిగూడెం: ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆరోపించారు. సీపీఐ జంగారెడ్డిగూడెం మండల 11వ మహాసభ గురువారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. పార్టీ పతాకాన్ని సీనియర్ కార్యకర్త చిలపరెడ్డి వెంకట రెడ్డి ఆవిష్కరించారు. కుంచే వసంత రావు, నిట్టా స్వర్ణకుమారి అధ్యక్షతన నిర్వహించిన సభలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఏడాది గడుస్తున్న అమలు చేయకుండా రాష్ట్ర ప్రజానీకాన్ని మోసం చేసిందని విమర్శించారు. సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభలు 2025 జూలై 5, 6, 7 తేదీల్లో చింతలపూడిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. తొలుత పట్టణంలో సీపీఐ కార్యకర్తలు ప్రదర్శన చేశారు. ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం ధారయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాడిస రాము, కొయ్యలగూడెం, ద్వారకాతిరుమల మండలాల కార్యదర్శులు టి.ఆంజనేయరాజు, గొలిమే బాల యేసు, కుక్కునూరు మండల సహాయ కార్యదర్శి కూరాకుల బాబురావు, జిల్లా సమితి సభ్యులు పి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

నేడు, రేపు క్రీస్తు మహాసభలు

కొయ్యలగూడెం: క్రీస్తు మహాసభలు 20, 21వ తేదీల్లో సీతంపేట జీడీఎం చర్చి గ్రౌండ్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు జీడీఎం చర్చి పాస్టర్ పీటర్ రాజు గురువారం తెలిపారు. పలువురు ఆధ్యాత్మిక వేత్తలు క్రీస్తు సందేశాన్ని వినిపిస్తారని, విశ్వాసులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా భక్తుల ప్రయాణం

- ట్రక్కు ఆటోల్లో కిక్కిరిసి శ్రీవారి క్షేత్రానికి వస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి క్షేత్రానికి కొందరు భక్తులు ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ట్రక్కు ఆటోలు, బొలేరో ట్రక్కు వాహనాల్లో పరిమితికి మించి భక్తులు ఎక్కి దైవదర్శనార్థం శ్రీవారి క్షేత్రానికి వస్తున్నారు. మర్గం మధ్యలో పెనుప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటనేది వారు ఆలోచించడంలేదు. ఏదో ఒక విధంగా క్షేత్రానికి వచ్చి వేంకటేశ్వర స్వామి వారిని దర్శించాలన్న ఆతృత, చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారుల వ్యవహార శైలి మాటున ప్రమాదాలు పొంచి ఉన్నాయి. క్షేత్రంలో వివాహాలు జరిగే సమయంలో ఇలాంటి ప్రయాణాలు ఎక్కువగా ఉంటున్నాయి. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా ఇటువంటి ప్రయాణాలను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని స్థానికులు, భక్తులు అధికారులను కోరుతున్నారు.


శ్రీవారి కొండపైకి బొలేరో ట్రక్కు వాహనంలో వస్తున్న భక్తులు


ట్రక్కు ఆటోలో కొండపైకి వస్తున్న భక్తులు

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

చింతలపూడి: విత్తనాలు ఎంఆర్‌పీ ధరకు మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా హెచ్చరించారు. చింతలపూడి మండలంలోని పలు విత్తనాల దుకాణాల్లో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. విత్తనాల శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా బాషా విలేకరులతో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, విక్రయించిన విత్తనాలకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని వ్యాపారులను ఆదేశించారు. గుర్తింపు పొందిన, లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనాలని రైతులకు సూచించారు. విత్తన కొనుగోలు రసీదు పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలన్నారు. పగిలిన ప్యాకెట్లు లేదా మూతలు తీసిన డబ్బాలోని విత్తనాలను కొనొద్దని రైతులకు సూచించారు. తనిఖీల్లో చింతలపూడి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్, మండల వ్యవసాయ అధికారి కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడి : విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

లింగపాలెం షాపులో తనిఖీ
లింగపాలెం: స్థానిక పురుగు మందుల షాపులో వ్యవసాయ శాఖ డీఏఓ హబీబ్ బాష గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. షాపులోని మందుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. పురుగు మందులు కొన్న రైతులకు బిల్లులు ఇవ్వాలని, మందులు అధిక రేట్లకు విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి వి.ప్రదీప్ కుమార్ తదితరులు ఉన్నారు.


లింగపాలెం : షాపులో మందులను పరిశీలిస్తున్న అధికారులు

అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయండి

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని వదిలి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిటికెన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన తన నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, సూపర్ సిక్స్ హామీ పథకాలు అటకెక్కాయని ధ్వజమెత్తారు. పథకాలపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని కూటమి నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. సోషలిస్టునని కాసేపు, కమ్యూనిస్టు సిద్ధాంతాలు నావని మరోసారి, ఇప్పుడు కాషాయం కట్టిన హిందువుగా పవన్ కళ్యాణ్ విభిన్న పాత్రలు పోషిస్తున్నారని వివరించారు. పాలనలోకి వచ్చిన సంవత్సరం వ్యవధిలోనే కూటమి పాలనపై ప్రజలు విరుచుకుపడుతున్నారని తెలిపారు. కక్ష సాధింపు చర్యలు మానుకొని ప్రజాస్వామ్యయుతంగా పాలించాలని కూటమి ప్రభుత్వానికి ఆయన సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని తెలిపారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత విషయాలను ఆయన కుటుంబాన్ని కించపరిచే విధానాలను మానుకోవాలని హితవుపలికారు. పార్టీ నాయకులు నిక్కర్ నాగేశ్వరరావు, తొంటా వాసు, మారిశెట్టి శ్రీనివాస్, చిడిపి రవి, చిరిగిన నాగార్జున, పులపాకులు బన్నీ, కోడెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్